## పోలీస్ శిక్షణ కేంద్రం తనిఖీ



శిక్షణ కేంద్రంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ఆలం

ఎదులాపురం, జూలై 19 : ఆదిలాబాద్ పట్టణంలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కానిస్టేబుళ్లకు వడ్డించే ఆహారాన్ని స్వయంగా తిని పరిశీలించారు. నాణ్యమైన వస్తువులతో రుచికరమైన ఆహారాన్ని వండాలని నిర్వాహకులకు సూచించారు. శిక్షణ కాలంలో శారీరక దారుఢ్యంతో పాటు, క్రమశిక్షణ పెంపొందించుకోవాలని కానిస్టేబుళ్లకు సూచించారు. ఆయుధాలను వాడే పద్ధతి, కేసుల పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగాన్ని తెలుసుకోవాలన్నారు. నూతన చట్టాలపై ప్రత్యేక తరగతులు కల్పిస్తామని సూచించారు. ఎస్పీ వెంట శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ సీ సమయ్ జాన్ రావు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుడికి మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శ



మిత్రుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూలై 19:బాల్యమిత్రుడు జీవన్ రెడ్డిని మాజీ మంత్రి జోగు రామన్న శుక్రవారం పరామర్శించారు. దీపాయిగుడాకు చెందిన జీవ న్ రెడ్డికి ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలు కాగా నిజామాబాద్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకొని బాల్య మిత్రుడిని జోగు రామన్న పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ బొల్లి గంగన్న, కృష్ణారెడ్డి, గణేశ్ పండ్ల, శ్రీనివాస్ ఉన్నారు.



ఇచ్చోడ ఎస్‌బీఐ బ్యాంకులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- కొత్త రుణాలివ్వాలి
- అధికారులకు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశం
- బ్యాంకుల్లో రుణమాఫీ ప్రక్రియ పరిశీలన

ఇచ్చోడ, జూలై 19 : రూ.లక్ష రుణమాఫీ అయిన రైతులకు ఇబ్బంది కలిగించకుండా కొత్త రుణాలివ్వాలని బ్యాంకు అధికారులను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం ఇచ్చోడలోని గ్రామీణ బ్యాంక్, ఎస్‌బీఐ, సహకార సంఘం బ్యాంకుల్లో రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ డబ్బులను ఇతర లోన్లకు కట్ చేయవద్దన్నారు. వెంటనే కొత్త రుణాలివ్వాలని బ్యాంకు మేనేజర్లకు సూచించారు. రుణమాఫీ లిస్టును సూచిక బోర్డుపై అతికించాలని సూచించారు. అనంతరం భీమన్న గుట్టను పరిశీలించారు. 2007లో ఇందిరమ్మ పథకం కింద ఇచ్చిన 26 ఎకరాల భూమిని కొందరు కబ్జా చేయడంతో తిరిగి భూమిని తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ భూమిలో అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను ఒకే చోట నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య, ఏడీ రామకృష్ణ, తహసీల్దార్ తుకారాం, డిప్యూటీ తహసీల్దార్ రామారావ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# రుణ మాఫీ కాకపాయె!

- రూ. లక్షలోపు రుణమున్నా కనిపించని రైతుల పేర్లు
- అస్పష్ట జాబితాతో అయోమయంలో అన్నదాతలు
- సమాచారం కోసం బ్యాంకులు, కార్యాలయాల వద్దకు పరుగులు
- ఏదో ఒకటి సర్దిచెప్పి పంపిస్తున్న అధికారులు, బ్యాంకర్లు



మంచిర్యాల, జూలై 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మొదటి విడుత రుణమాఫీలో అనేక మంది రైతుల పేర్లు గల్లంతయినట్లు తెలుస్తున్నది. ఒకరిద్దరు కాదు.. వేలాది మందికి అన్యాయం జరిగినట్లు సమాచారమున్నది. జాబితాలో లేని రైతులకు రుణమాఫీ జరుగుతుందా..? లేదా..? అన్నదానిపై స్పష్టత నివ్వకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. అసలు ఏ నిబంధనల ప్రకారం రుణమాఫీ చేశారో స్పష్టత ఇవ్వకపోవడంపై అయోమయానికి గురిచేస్తున్నది. అసలు రుణమాఫీ అర్హుల జాబితా ఏ ప్రాతిపదికన తయారు చేశారన్న దానిపైనా క్లారిటీ లేదు. రుణమాఫీకి రేషన్‌కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రేషన్‌కార్డు యూనిట్‌గా రుణమాఫీ చేస్తుండడంతో ఇప్పటికే చాలా మందికి అన్యాయం జరిగింది. రేషన్‌కార్డు లేని వారికి అసలు మాఫీ జరగలేదు. దీనిపై వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే రేషన్‌కార్డు లేనోళ్లకు సర్వే చేసినంక మాఫీ చేస్తారని చెబుతున్నారు. ఆ సర్వే ఎప్పుడు చేయాలి.. మా రుణాలు ఎప్పుడు మాఫీ కావాలంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. లిస్టులో పేరున్నప్పటికీ కొందరు రైతులకు రుణాలు మాఫీ కాలేదు. బ్యాంకులకు వెళ్లి అడిగితే ప్రాసెస్‌లో ఉంది రేపో.. ఎల్లుండో పడుతుందని, ట్రెజరీలో ఉంది ఇంకా పడలేదని చెబుతున్నారు. మరికొందరు రైతులకు కేవైసీ పెండింగ్ ఉండడం వల్ల రుణం మాఫీ కాలేదంటూ చెప్పుకొస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ బ్యాంకుల్లో లోన్లు తీసుకున్న రైతులు చాలా మందికి రుణాలు మాఫీ కాలేదు. జన్నారంలో ఓ రైతు నా లోన్ ఎందుకు మాఫీ అవ్వలేదని అడిగితే... బ్యాంక్ అధికారులు మా చేతుల్లో ఏం లేదు.. ప్రభుత్వం పంపించిన రైతుల రుణాలు మాఫీ చేస్తున్నాం. లేని వారివి చేయడం లేదంటూ తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆ రైతు ప్రెస్‌క్లబ్ దగ్గరకు వచ్చి తన గోడు మీడియాకు విన్నవించుకున్నాడు. రూ. లక్షలోపు రుణం ఉన్నా.. మాఫీ కాని కొందరు రైతులు తమ గోడును 'నమస్తే తెలంగాణ'కు చెప్పుకున్నారు.

### అయోమయం..

*ఆదిలాబాద్, జూలై 19 ( నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన రూ.1 లక్ష పంట రుణమాఫీ రైతుల్లో అయోమయానికి గురి చేస్తున్నది. జిల్లాలో 18,353 మంది రైతులకు రూ. 120.78 కోట్లు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తాము బ్యాంకుల్లో తీసుకున్న లోన్ మాఫీ అయిందా.. లేదా.. అని విషయాన్ని తెలుసుకునేందుకు రైతులు శుక్రవారం జిల్లాలోని బ్యాంకుల వద్దకు లోన్ పాసు పుస్తకాలతో వచ్చి ఆరా తీశారు. బ్యాంకు అధికారులు, సిబ్బందిని కలిసి తమ లోన్లపై అడిగి తెలుసుకున్నారు. తమకు పట్టా పాసుపుస్తకం ఉన్నా రేషన్‌కార్డు లేకపోవడంతో లోన్ మాఫీ కాలేదని రైతులు అంటున్నారు.*

### లిస్టులో నాపేరు లేదు..



*ఉట్నూర్ రూరల్, జూలై 19: నా పేరు మీద 4 ఎకరాల భూమి ఉంది. నేను ఎస్‌బీఐ బ్యాంక్‌లో పట్టా కాగితాలు పెట్టి పోయిన సంవత్సరం లక్ష రూపాయల లోన్ తీసుకున్న. లోన్ మాఫీ అయిన లిస్టులో నాపేరు లేదు. బ్యాంకు అధికారుల దగ్గరకు వెళ్లి మాఫీ గురించి అడిగాను. వారు రూ.10 వేలు కట్టి రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. అసలు నాకు వస్తాయా రావా తెలవడం లేదు. రుణమాఫీ చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.*

**-సిడాం రుక్మాబాయి, కొలాంగూడ, ఉట్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా**

### రేషన్ కార్డు లేదని రుణ మాఫీ చేయలేదు..



*కుంటాల, జూలై, 19 : నాకు రెండు ఎకరాల భూమి ఉంది. బ్యాంకులో రూ. 80 వేల రుణం తీసుకొని పంట కోసం ఖర్చు పెట్టిన,. ఇంకా సమయానికి రైతు భరోసా కూడా రాకపోవడంతో వానకాలం పంట ఖర్చులకు ఇతరుల దగ్గర అప్పు చేయాల్సి వస్తున్నది. నాకు రేషన్ కార్డు లేకపోవడంతో లక్షలోపు రుణ మాఫీ జాబితాలో నా పేరు రాలేదని చెప్పారు. రుణమాఫీ నాకు వర్తిస్తుందో లేదో అని ఆందోళనగా ఉంది.*

**-తురాటి గజ్జారాం, రైతు, కుంటాల, నిర్మల్ జిల్లా**

### నాకు ఎందుకు మాఫీ కాలేదు..



*పెంబి, జూలై 19: నాకు 26 గుంటల వ్యవసాయ భూమి ఉంది. పెంబి ఎస్‌బీఐ బ్యాంక్‌లో పంట రుణం తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలియడంతో శుక్రవారం బ్యాంక్‌కు వెళ్లి అధికారులను అడిగాను. నీ పేరు మీద రూ. 60 వేలు రుణం ఉంది కానీ మాఫీ కాలేదని చెప్పారు. ఎందుకు మాఫీ కాలేదని అడిగితే మాకు తెలియదంటున్నారు. రుణం మాఫీ చేస్తుందంటే ఎంతో సంబురపడ్డ. అందరితో పాటు నాకు కూడా రుణమాఫీ చేయాలి.*

**-చెన్నూరి జోగయ్య, రైతు, పెంబి, నిర్మల్ జిల్లా**

### రుణమాఫీపై అయోమయంగా ఉంది.



*ఉట్నూర్ రూరల్, జూలై 19: నాకు 1.10 ఎకరాల భూమి ఉంది. నేను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గతంలో రూ.50 వేల వ్యవసాయ రుణం తీసుకున్నాను. కేసీఆర్ ప్రభుత్వం మాఫీ చేసింది. మరల గత సంవత్సరం 26 వేల రూపాయల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ అయిందని అంటున్నారు. ఎవరిని అడగాలో అర్థం కావడంలేదు. అధికారులు పట్టించుకొని రుణమాఫీ అయిన మొత్తాన్ని అందించాలి.*

**-టేకం దేవురావు, గంగాపూర్, ఉట్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా**

### నాకు రుణమాఫీ కాలేదు..



*ఆదిలాబాద్, జూలై 19 ( నమస్తే తెలంగాణ) : మాకు అమ్మ, నాన్నతో పాటు అన్నయ్యకు కలిపి ఒకే రేషన్‌కార్డు ఉంది. నాకు వివాహం అయి భార్యా, పిల్లలు ఉన్నారు. నాకు పట్టా పాసుపుస్తకం ఉన్నా, రేషన్‌కార్డు రాలేదు. నేను బ్యాంకులో రూ.17 వేల రుణం తీసుకున్నాను. కానీ నాకు లోన్ మాఫీ కాలేదు. బ్యాంకు అధికారులను అడిగితే మీ లోన్ మాఫీ కాలేదంటున్నారు. అర్హుడిగా ఉన్న నాకు రేషన్‌కార్డు లేకున్నా రుణమాఫీ చేయాలి.*

**- వినోద్‌రెడ్డి, రైతు, కజ్జర్ల, తలమడుగు మండలం**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## కేజీబీవీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై19 : కేజీబీవీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రిన్సిపాళ్లు, ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిత్యం తనిఖీలు చేస్తూ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు. తనిఖీలకు సంబంధించిన సమాచార నివేదికలను అందజేయాలన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని, అల్పాహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అన్ని రకాల కమిటీలను ఏర్పాటు చేసి ఇందులో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధరణి, ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

- సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేయాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా


ఎదులాపురం, జూలై 19 : ధరణి, ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలని అధికారులను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శుక్రవారం ధర ణి, ప్రజావాణి, అధిక వర్షాలపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ రాజర్షి షా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టు 15 నాటికి ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని తహసీల్దార్లు ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులపై మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

### ఏర్పాట్లు పూర్తి చేయాలి

త్వరలో జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారని, ఆయన ప్రారంభించనున్న కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాతో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటనకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలీపాడ్ వద్ద షామియానా, కుర్చీలు, బారికెడ్లు ఏర్పాటు చేయాలని, రిమ్స్ సూపర్ స్పెషాలిటీ దవాఖానలో మహిళా శక్తి క్యాంటీన్, ఎంఆర్ఐ స్కానర్, కేజీబీవీ హైస్కూల్, బంగారిగూడ, కమాండర్ కంట్రోల్ సెంటర్, మదర్ పౌల్ట్రీ యూనిట్లను ఒకే చోట బటన్ క్లిక్ చేసి ప్రారంభిస్తారన్నారు. టీటీడీసీలో ఏర్పాటు చేసిన సమావేశానికి లంచ్, తదితర ఏర్పాట్లను ప్రత్యేక శ్రద్ధతో అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, అనుమతి ఉన్న వారినే లోనికి పంపించాలన్నారు.

### ధరణి ఆపరేటర్లకు స్థానచలనం

ఆదిలాబాద్ జిల్లాలో కొన్నేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న 18 మంది ధరణి ఆపరేటర్లను బదిలీ చేస్తూ కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆయా మండలాల తహసీల్ కార్యాలయాల్లో చేరాలని ఆదేశించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని కొందరిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తారని అంతా భావించిన పక్క మండలానికే కేటాయించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



సిరికొండలోని బ్యాంకులో క్యూలో నిలబడిన రైతులు

## బ్యాంకుల్లో 'రుణమాఫీ' క్యూ లైన్లు..

*రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్షలోపు పంట రుణమాఫీ ప్రకటించడంతో మాఫీ అయిందో కాలేదో అని తెలుసుకునేందుకు ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని బ్యాంకులకు శుక్రవారం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడి వివరాలు తెలుసుకున్నారు.*

*– ఇచ్చోడ(సిరికొండ), జూలై 19*

### నిర్మల్ జిల్లాలో 33.4 మి.మీ. వర్షపాతం నమోదు

నిర్మల్ అర్బన్, జూలై 19 : నిర్మల్ జిల్లాలో గత 24 గంటల్లో 32.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కుభీర్‌లో 24.4, తానూర్‌లో 10.8, బాసర 16.8, ముథోల్ 14, భైంసా 23.6, కుంటాల 15.2, నర్సాపూర్ (జీ) 20.0, లోకేశ్వరం 22.0, దిలావర్‌పూర్ 17.2, సారంగపూర్ 30.3, నిర్మల్ రూరల్ 19.8, నిర్మల్ 27.8, సోన్ 18.2,లక్ష్మణ్‌చాంద 27.2, మామడ 16.2, పెంబి 87.2, ఖానాపూర్ 49.6, కడెం 118.6, దస్తూరాబాద్ 56.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

## అధికారం కోసం అబద్ధాలాడిన సీఎం రేవంత్‌రెడ్డి

- కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఎప్పడిస్తరు..?
- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూలై 19 : సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో 26 మంది కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్ల వివాహానికి తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో చెప్పారని, ఆ హామీని ఎప్పుడు నెరవేరుస్తారో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలనే కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కొంతమందికే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, ఇచ్చోడ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ నాగారావ్, డిప్యూటీ తహసీల్దార్, నాయకులు సురేందర్, గులాబ్‌సింగ్, పండరి, పాండురంగ్, ప్రతాప్‌సింగ్, తిత్రే మేర్‌సింగ్, ప్రదీప్, లబ్ధిదారులున్నారు.

### మాజీ జడ్పీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

భీంపూర్, జూలై 19 : కామట్‌వాడ మాజీ సర్పంచ్ తాటిపెల్లి రత్నాబాయి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కామట్‌వాడ సందర్శించారు. రత్నాబాయి కుమారుడు మాజీ జడ్పీటీసీ తాటిపెల్లి రాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో నాయకులు సామ నాగారెడ్డి, గంధం రమణ, జీ నరేందర్‌యాదవ్, సంజీవ్‌రెడ్డి, మేకల నాగయ్య తదితరులున్నారు.




ముక్రా(కే) గ్రామంలో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటినప్పటి ఫొటో




వృక్షాలుగా పెరిగి పచ్చదనంతో కళ కళ లాడుతున్నముక్రా(కే) గ్రామం

## నాటి మొక్కలే నేటి వృక్షాలు..

*ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కే) గ్రామంలో జోగినపల్లి సంతోష్ కుమార్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కనువిందు చేస్తుండడంతో ప్రయాణికులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. గ్రామంలో 1,05,624 మొక్కలు నాటి వంద శాతం బతికించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో నాటిన మొక్కలు గ్రామాలను ఏవిధంగా హరిత గ్రామాలుగా మార్చాయో అనడానికి ఈ రెండు ఫొటోలే సాక్ష్యం.*

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూలై 19*